ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
బుధవారం 12 ఫిబ్రవరి 2025



పొద్దంతా ఎండ.. రాత్రి వేళల్లో చలి..

- ఫిబ్రవరిలోనే ముదిరిన ఎండలు
- ఎల్లో జోన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా
- గరిష్ఠ ఉష్ణోగ్రత 37.4 డిగ్రీలుగా నమోదు

సిరిసిల్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎండలు అప్పుడే ముదురుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. పగలంతా ఎండవేడితో ప్రజలు సతమతం అవుతున్నారు. రాత్రి వేళల్లో తెల్లవారుజామున పొగమంచు కనిపిస్తోంది. చలికాలం ముగియకముందే ఫిబ్రవరి మొదటివారం నుంచే పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలు ఉండగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 17.7డిగ్రీలుగా ఉంది. మండలాల్లో వీర్నపల్లిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలు ఉండగా, చందుర్తిలో 37.4, సిరిసిల్లలో 36.9, తంగళ్లపల్లి, కోనరావుపేటలో 33.1, రుద్రంగిలో 35.8, ఇల్లంతకుంట, ముస్తాబాద్‌లో 33.5, గంభీరావుపేటలో 33.8, వేములవాడలో 33.5, వేములవాడ రూరల్‌లో 35.0, బోయినపల్లిలో 34.7, ఎల్లారెడ్డిపేటలో 34.3 గరిష్ఠ ఉష్ణోగ్రతలుగా నమోదయ్యాయి.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

వేములవాడ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని బహుజన సేన ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ అన్నారు. వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు బహుజన సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రతి ఇంటికి చేర్చాలనే లక్ష్యంతో తమ ఆర్గనైజేషన్ పనిచేస్తుందని, రాజ్యాంగ ప్రాముఖ్యతను, హక్కులను ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు అశోక్, అంజయ్య, శ్రీనివాసరావు, ప్రధాన ఉపాధ్యాయులు వికృతి లక్ష్మీనారాయణ, గుడిసె మనోజ్ కుమార్, కిషోర్ మూలే, లక్కీ సాగర్, జింక శ్రీనివాస్, గుడిసె అరుణ్, శ్రీకాంత్, ముద్రకోల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందే పరిషత్ ఎన్నికలా..?



- వేగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల ఏర్పాట్లు
- రిజర్వేషన్ల వైపే అందరి చూపు
- ఓటర్ల జాబితా సిద్ధం
- జిల్లాలో పెరగని స్థానాలు
- జిల్లాలో పరిషత్ ఓటర్లు 3,53,796 మంది
- 709 పోలింగ్ కేంద్రాలు... 3,700 మంది సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్వంసిద్ధం చేశారు. బ్యాలెట్ పేపర్లతో సహా ఏర్పాట్లు జరిగినా ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల కంటే పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తారనే చర్చ మొదలైంది. వేగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఏర్పాట్లు మొదలు పెట్టారు. అందుకు సంబంధించిన ఎన్నికల సామగ్రి కూడా జిల్లాలకు పంపించారు. ఓటర్ల జాబితాను సిద్ధం చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి కూడా పంపించారు. ఇందుకు అనుగుణంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో పరిషత్ ఎన్నికల హడావుడి ముందుకు వచ్చింది. ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుపై చర్చ కొనసాగుతోంది. 2019 ఎన్నికల్లో 12జడ్పీటీసీ స్థానాల్లో ఒకటి ఎస్టీ మహిళ, ఒకటి ఎస్సీ మహిళ, రెండు ఎస్సీ జనరల్, ఒకటి బీసీ మహిళ, ఒకటి బీసీ జనరల్, మూడు జనరల్ మహిళ, మరోమూడు జనరల్‌లకు కేటాయించారు. రిజర్వేషన్ల ప్రకారం ఆరు మహిళలకు, ఆరు జనరల్‌గా ఉన్నాయి. 123 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 68మహిళలకు, 58 జనరల్‌కు కేటాయించారు. ఇందులో ఎస్టీలకు ఆరు కేటాయించగా, 5 మహిళలకు, ఒకటి జనరల్‌గా ఉంది. 28 ఎస్సీలకు కేటాయించగా, 17 మహిళలకు, 11 జనరల్, 25బీసీలకు కేటాయించగా, 14 మహిళలకు, 11 జనరల్ స్థానాలుగా ఉన్నాయి. 64జనరల్ స్థానాలు ఉండగా, 29 మహిళలకు, 25 జనరల్‌గా కేటాయించారు. ఈసారి రిజర్వేషన్లు మార్పు ఏలా ఉంటుందనే చర్చ కొనసాగుతోంది. జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. కొత్తస్థానాలు పెరగకపోవడంతో పాత తరహాలోనే ఏర్పాట్లు జరుగుతున్నాయి. రిజర్వేషన్లపై 50శాతం మించ కూడదనే సుప్రీం కోర్టు నిబంధనలు ఉన్నాయి. బీసీలకు 42శాతం సీట్లు ఇస్తామని, జనరల్ స్థానాల్లో ప్రాధాన్యం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఇదేక్రమంలో ఇతర పార్టీలు కూడా బీసీలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెట్టిన ఆశావహులు మళ్లీ పరిషత్ ఎన్నికలపై దృష్టి సారించడంతో పల్లెల్లో సందడి కనిపిస్తోంది.

● ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. బోయినపల్లి, చందుర్తి, ఇల్లంతకుంట, గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్, రుద్రంగి, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్, ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాల్లో బోయినపల్లి మండలంలో 11 స్థానాలు, చందుర్తిలో..

మిగతా 8లో

జడ్పీటీసీ ఎంపీటీసీ ఓటర్లు...

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
బోయినపల్లి	15001	16019	31020
చందుర్తి	13444	14651	28095
ఇల్లంతకుంట	19775	20977	40752
గంభీరావుపేట	17889	19061	36951(జెండర్ 1)
కోనరావుపేట	17174	18057	35231
ముస్తాబాద్	18833	19984	38817
రుద్రంగి	6435	7176	13614(జెండర్ 3)
తంగళ్లపల్లి	18809	19891	38700
వీర్నపల్లి	5911	6063	11974
వేములవాడ అర్బన్	9099	9623	18738(జెండర్ 16)
వేములవాడ రూరల్	9119	9918	19017
ఎల్లారెడ్డిపేట	19705	21182	40887
మొత్తం	171174	182602	353796(జెండర్ 20)

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..



నర్మాల గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గంభీరావుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రెసిడెన్షియల్ విద్యాలయంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి? మెనూ పాటిస్తున్నారా? అని విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆరా తీశారు. గంభీరావుపేట మండలం నర్మాలలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు పరిశీలించారు. అనంతరం కిచెన్, స్టోర్ రూమ్‌లో ఆయా ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థినులు రివిజన్ చేస్తుండగా, కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. విద్యాలయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? ఇంకా ఏయే సౌకర్యాలు కావాలి అని అడిగితెలుసుకున్నారు. పలు అంశాలపై ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో నిత్యం చదవాలని పిలుపునిచ్చారు. ప్రతి సబ్జెక్టులో వచ్చే సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సృజన, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా వైద్యాధికారి రజిత



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించి రాష్ట్రంలోనే జిల్లాకు మంచి పేరును తేవాలని జిల్లా వైద్యధికారి డాక్టర్ రజిత కోరారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యధికారి డాక్టర్ రజిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. మాతాశిశు ఆరోగ్య సేవలు, ఎన్సీడీ, టీబీ, కుష్ఠు వ్యాధితోపాటు ఆయుష్మాన్ ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అఫీజా, ఆయుష్ డాక్టర్ దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్య కాషాయీకరణకు బీజేపీ ప్రభుత్వం కుట్ర..

- ఏఐఎస్ఎఫ్ నాయకుడు మర్రి వెంకటస్వామి



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

8

చల్లగా చూడమ్మ.. బద్దిపోచమ్మ తల్లీ..

- అమ్మవారికి భక్తుల బోనం మొక్కులు
- నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులు



బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

7

'హరీశ్‌రావు చిల్లర రాజకీయాలు మానుకోవాలి'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు వార్తల్లో ఉండాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చేస్తున్న చిల్లర రాజకీయాలను మానుకోవాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. ముస్తాబాద్‌కు చెందిన రైతుకు 31 గుంటల పట్టా ఉంటే 11 గుంటలకు రైతుబంధు వేశారంటూ హరీశ్‌రావు చేసిన విమర్శలను కేకే మహేందర్‌రెడ్డి ఖండించారు. ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన నకీర్తి కనుకవ్వ అనే రైతుకు కేవలం 11గుంటల పట్టా భూమికి రైతు బంధు రూ.1650 బ్యాంక్‌లో వేయడం జరిగిందని పేర్కొన్నారు. రైతుకు 11 గుంటలు ఉంటే 31 గుంటలకు 11గుంటలకే రైతుబంధు వేశారంటూ అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటని ప్రకటనలో విమర్శించారు. రైతు నకీర్తి కనుకవ్వకు చెందిన పట్టా పాస్‌బుక్ జిరాక్స్‌ను మీడియాకు పంపించారు.

న్యూస్ బాక్స్

రేపు ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఈనెల 13న ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించనున్నామని ఎంపీడీవో సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 1-402023 నుంచి 31-3-2024 వరకు ఈజీఎస్ కింద చేపట్టిన పనులను క్షేత్ర స్థాయిలో ఈనెల 3 నుంచి 13 వరకు తనిఖీలు నిర్వహించారని పేర్కొన్నారు. తనిఖీ నివేదికలను ఈ నెల 13న ప్రజా వేదికలో వెల్లడిస్తారని చెప్పారు. అధికారులు, ప్రజలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

గంజాయికి బానిసలు కావొద్దు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిసలుగా మారి జీవితాలను పాడుచేసుకోవద్దని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి పేర్కొన్నారు. మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో మంగళవారం మీకోసం కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు కెరియర్‌పై దృష్టి నిలుపాలన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. సమావేశంలో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, వీపీఓ తిరుపతిలతో పాటు పోలీస్‌సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు..

ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన వరి పొలాల్లో మోతాదుకు మించి యూరియాను వాడకూడదని మండల వ్యవసాయ అధికారి కవిత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధిక మోతాదులో యూరియాను వాడడం వల్ల పైరు ఏపుగా పెరిగి తెగులు సోకడంతో పాటు దిగుబడిపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఎకరాకు రెండు బస్తాలు చల్లాలని పేర్కొన్నారు. నాటు, పిలక, చిరు పొట్ట దశలో విడుతల వారీగా వాడాలని అన్నారు. రైతులు సరైన సమయంలో తగిన మోతాదు యూరియాను వాడి దిగుబడిని పెంచుకోవాలని అధికారి కవిత కోరారు.

ఎమ్మెల్సీ పోలింగ్ విధులపై సంపూర్ణ అవగాహన ఉండాలి

- సీపీవో, మ్యాన్‌పవర్ అండ్ ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి



మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సీపీవో, మ్యాన్‌పవర్ అండ్ ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్‌అధికారులు, ఓపీవోలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళవారం మొదటి విడుత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీవో మాటాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందని తెలిపారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు కొంత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవహరిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్‌లో ఉన్న వారికి టోకెన్ నంబర్లు అందించి ఓటింగ్ చేయించాలని ఆదేశించారు. ఈనెల 26న ఉదయం 8 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్‌లిస్టు, అనుగుణంగా మెటీరియల్ సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పోలింగ్ జరిగేలా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ డే సందర్భంగా పీవోలు, ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్లు మహేందర్ రెడ్డి, శ్రీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో పీవోలు 42మంది, ఏపీవోలు 42, ఓపీవోలు 97, మైక్రోఅబ్జర్వర్స్ 7కేటాయించగా, కామన్ పోలింగ్ కేంద్రాలు 7, జనరల్ పోలింగ్‌కేంద్రాలు 27 ఏర్పాటు చేయనున్నారు. డీడబ్ల్యూఓ, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజం, పీవో, ఏపీవోలు, ఓపీవోలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ల్యాబ్ గదులకు మరమ్మతులు చేపట్టాలి

- జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి వినతి



డీఐఈవోకు వినతి పత్రాన్ని అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సిరిసిల్ల రూరల్,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ప్రభుత్వం జూనియర్ కళాశాలలో శిథిలావస్థకు చేరిన ల్యాబ్ గదులకు మరమ్మతు చేయాలని లేకుంటే మరో గదుల్లోకి మార్చాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈవో కార్యాలయంలో మంగళవారం డీఐఈవోకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1969లో ఏర్పాటు చేసిన ల్యాబ్ గదులల్లో ఇంటర్మీడి యెట్ చదువుతున్న విద్యార్థుల కోసం ల్యాబ్‌లను ఏర్పా టుచేశారు. గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతాయోనని విద్యార్థులు భయంతోనే ల్యాబ్ ప్రాక్టికల్స్ చేస్తున్నారన్నారు. కళాశాలలో సరైన గదులు లేకపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ల్యాబ్‌లను మరో గదుల్లో మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌గౌడ్, సామల శ్రీకాంత్, మట్టి తిరుపతి, సంపత్, లక్ష్మణ్, నితిన్, రవి, హరీష్, సంతోష్, అజయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కూలి పెంచి పనులు కల్పించాలి..

- సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాటన్ చీరల మరమగ్గాల నడిపే కార్మికులకు యజమానులు కూలి పెంచి పనులు కల్పించాలని లేకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేస్తామని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. సిరిసిల్లలో కాటన్ మరమగ్గాల కార్మికులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్లలో కాటన్ చీరలను మరమగ్గాలపై ఉత్పత్తి చేయిస్తున్న ఇద్దరు యజమానులకు కూలి పెంచమని వినతిపత్రం అందిస్తే వారి వద్ద పనిచేసే కార్మికులు, ఆసాములను పనులు ఇవ్వకుండా పరిశ్రమలను బంద్ చేసి బయటకు పంపించారని, ఇదేమిటని అడిగితే ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని యజమానులు వైఖరిని ఖండిస్తున్నామన్నారు. యజమానులపై చేనేత జౌళి శాఖ అధికారులకు ఫిర్యాదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరినప్పటికి ఏలాంటి స్పందన లేకుండా పోయిందని అన్నారు. ఈ విషయాన్ని జౌళి శాఖ కమిషనర్‌కు తెలిపి చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వడ్నాల వీరేశం, నల్ల మార్కండేయులు, సంపత్, జక్కని అనందం, సత్యం, రాములు పాల్గొన్నారు.

ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీవో సత్తయ్య మంగళవారం ప్రదర్శించారు. మండలంలో మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలు, ఒక జడ్పీటీసీ స్థానాలకు 85 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మొత్తం ఓటర్లు 40887 ఉండగా వారిలో మహిళలు 21182 పురుషులు 19705 మంది ఉన్నారని ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు. ఎంపీవో రాజు, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

● చందుర్తి : మండల పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూలు ప్రకారం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 2025లకు సంబంధించిన పోలింగ్ కేంద్రంలో జాబితాను ప్రదర్శించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరకట్నం వేధింపుల కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ శ్రీనిజ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన నల్లాల విక్రమ్‌కు 11 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రీలేఖతో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తర్వాత అదనంగా వరకట్నం తేవాలంటూ విక్రమ్ తన భార్య శ్రీలేఖను తరచుగా వేధించాడు. పెద్ద మనుషుల సమక్షంలో పలు పంచాయితీలు జరిగాయి. అయినప్పటికీ విక్రమ్ భార్యను వేధించడంతో పాటు 2019 మార్చి 17న దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ పోలీసులు సరైన సాక్షులను జగిత్యాల కోర్టులో మంగళవారం ప్రవేశపెట్టారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేష్ తమ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి ఒక వాహనానికి తీసుకుని మరో ట్రాలీతో ఇసుకను రవాణా చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ కంకణాల సుధాకర్, డ్రైవర్ సూర నరసింహులుపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. అతివేగం, అజాగ్రత్తగా ఇసుకను తరలిస్తున్న క్రమంలో తనిఖీ చేయగా ఒక ట్రాక్టర్ నంబర్‌పై అనుమతి పొంది మరో ట్రాలీతో రవాణా చేయడాన్ని గుర్తించామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుకను తరలించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు.

ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరిని మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. పొతూరు సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. కందికట్కూర్ గ్రామానికి చెందిన రంగు రజనీకాంత్, మామిండ్ల పర్శరాంలను అరెస్టు చేసి, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు. మానకొండూర్ మండలం వెల్ది గ్రామం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కాచాపూర్ శివారులో పట్టుకున్నారు.

చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన చెంచల సంపత్(35) అనే యువ రైతు మంగళవారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. రోజు వారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లిన సంపత్ చింతచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రూ.7,100 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,100 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 26మంది రైతులు 225క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 16క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు.ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.



చెరువు నుంచి కొట్టుకొచ్చిన రాళ్లు

చెరువు కట్ట మరమ్మతుకు మోక్షమెప్పుడో..?

● రెండున్నరేళ్లుగా రైతుల ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పోతు చెరువు కట్ట మరమ్మతుకు మోక్షమెప్పుడు కలుగుతుందోనని గంగారాంతండా, సూరంపేట గ్రామాల రైతులు ఎదురు చూస్తున్నారు. రెండున్నరేళ్ల క్రితం వర్షాల కారణంగా పోతు చెరువు కట్ట నీటి ప్రవాహానికి తెగింది. దీంతో కట్ట కింద ఉన్న పొలాలలో ఇసుక మేటలు పెట్టాయి. పలువురు రైతుల పశువులు, మేకలు మృతి చెందాయి. బోరుబావులు, వ్యవసాయ బావులు, పైపులైన్లు, కరెంట్ స్థంబాలు, విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. దీంతో సుమారు 250 మంది రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయారు. పలు శాఖల అధికారులు వచ్చి ఆస్తి, పంట నష్టం సర్వే చేసినా పరిహారం అందలేదు. 20 మంది బాధితులకు రెడ్ క్రాస్ సంస్థ 2వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. పోతు చెరువు కింద 500 ఎకరాల నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికీ చెరువు కట్ట మరమ్మతుకు నోచుకోక పోవడంతో రెండున్నరేళ్ళుగా కురుస్తున్న వర్షాలకు నీరు వృథాగా పోతోంది. పోతు చెరువు నీటితో నిండినట్ల యితే మండలంలోని కోనాపూర్, పోతారం, దమ్మయ్య పేట చెరువులే కాకుండా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గోవిం దారం, పసునూరు, చందుర్తిమల్యాల, రామన్న పేట, నర్సింగాపూర్ గ్రామాల చెరువులకు కూడా భూ గర్భ జలాలు వృద్ధి చెందుతాయని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోతు చెరువు కట్టకు మరమ్మతు చేయించాలని రైతులు కోరుతున్నారు.





తెగిన పోతుచెరువు కట్ట, పొలాల్లో ఇసుక మేటలు

మరమ్మతు చేయించాలి

బొజ్యానాయక్, మాజీ సర్పంచ్ గంగారాంతండా



పోతు చెరువుకట్టకు మరమ్మతు చేయించాలి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి. కట్ట తెగిపోవడంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి.

ప్రతిపాదనలు పంపాం

రాజేష్‌ఖన్నా, నీటి పారుదల శాఖ ఏఈఈ



మండలంలోని పోతు చెరువు కట్ట మరమ్మతుకు 3కోట్ల 78 లక్షల రూపాయల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే చెరువు కట్ట మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

ఎమ్మెల్యేను బెదిరించిన కేసులో నిందితుడి అరెస్టు

● బెంగుళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను వాట్సప్ కాల్ ద్వారా బెదిరించి, 20 లక్షలు డిమాండ్ చేసిన కేసులో హైదరాబాద్‌కు చెందిన యాస అఖిలేష్‌రెడ్డి(33)ని కొత్తపల్లి పోలీసులు సోమవారం బెంగుళూరులో అరెస్టు చేశారు. మంగళవారం అతడిని కరీంనగర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ మీడియాకు వివరాలు తెలియజేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గత సెప్టెంబరు 28న లండన్ నుంచి అఖిలేష్‌రెడ్డి వాట్సప్‌కాల్ చేసి తనకు రూ. 20 లక్షలు చెల్లించాలని, లేదంటే రాజకీయంగా అప్రతిష్ఠపాలు చేస్తానని, గౌరవానికి భంగం కలిగిస్తానని, ఎమ్మెల్యే ఇద్దరు పిల్లలను అనాథలయ్యేలా చేస్తానంటూ బెదిరించాడు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌లోని భవానీనగర్‌కు చెందిన యాస అఖిలేష్‌రెడ్డి అని, అతడు ప్రస్తుతం లండన్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్టోబరు నెలలో అప్పటి కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంటరమణ లుక్ అవుట్ సర్క్యులర్‌ను జారీ చేశారు. నిందితుడు ఈ నెల 9న బెంగుళూరు విమానాశ్రయానికి వచ్చినట్లు గమనించిన బెంగుళూరులోని ఇమ్మిగ్రేషన్ అధికారులు వెంటనే అఖిలేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కొత్తపల్లి ఎస్ఐకి సమాచారం అందించారు. కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తన సిబ్బందితో బెంగుళూర్‌కు వెళ్లి నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తీసుకువచ్చారు. మంగళవారం కోర్టులో హాజరుపరచి, మెజిస్ట్రేట్ ఆదేశాలతో కరీంనగర్ జైలులో రిమాండ్‌కు తరలించారు.

వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వృద్ధులు ఎక్కడ ఆత్మహత్యలకు పాల్పడినా విచారణ జరిపించాలని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మండలం మియాపూర్‌కు చెందిన గండి వీరేశం అనే వృద్ధుడు కోడలు, కొడుకు తిట్టి ఇంటిలో నుంచి వెళ్లగొట్టడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటలో కారకులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు.

భార్య, కొడుకుపై హత్యాయత్నం : నిందితుడి అరెస్టు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్య, కొడుకుపై హత్యాయత్నం చేసిన ఘటన గోదావరిఖని జీఎం కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనలో నిందితుడు మడిపల్లి ఉదయ్(30)ని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగి ఉదయ్ 2022లో అనూష అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి 18నెలల బాబు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో ఉదయ్‌పై కేసు నమోదైంది. కుటుంబ వివాదాలతో భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. భార్య అనూష గోదావరిఖని జీఎం కాలనీలోని పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఉదయ్ అత్తగారింటికి వెళ్లి భార్య, కుమారున్ని బైక్‌తో ఢీకొట్టి చంపేప్రయత్నం చేశాడు. చుట్టు పక్కల వారు అడ్డుకోవడంతో పారిపోయాడు. అనూష ఇచ్చిన ఫిర్యాదుతో ఉదయ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేశామని, బైక్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరి తీరంలో యథేచ్ఛగా ఇసుక దందా

● అనుమతి లేకుండా ఇసుక రీచ్‌లు ● అధికార పార్టీ నేత కనుసన్నల్లో రవాణా

జ్యోతినగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది తీరంలో ఇసుక అక్రమ దందా నడుస్తోంది. రామగుండం మండలం మేడిపల్లి శివారు గోదావరి తీరంలోని ఇసుక రీచ్ నుంచి కొన్ని రోజులుగా ట్రాక్టర్లలో యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. మేడిపల్లి శివారులోని రీచ్ నుంచి ఇసుక తరలించేందుకు అనుమతి లేకున్నప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకుడి పలుకుబడితో ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లకు మాత్రమే ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ ప్రాంతంలో అంతర్గాం మండలం గోలివాడ రీచ్‌కు మాత్రమే అనుమతి ఉంది. అయితే మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతి లేకుండానే మేడిపల్లి శివారు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. నదిలో నీరు పుష్కలంగా ఉండడంతో ఇసుకను తరలించ లేదు. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని గోదావరి నీరు లేకపోవడంతో ప్రభుత్వం ఇసుక రీచ్‌లకు అనుమతి నిచ్చి ఉచితంగా సరఫరా స్కీంను అమలు చేస్తున్నది. ఇది కూడా కేవలం సొంత ఇంటి నిర్మాణాలకు మాత్ర మే ఇసుకను సరఫరా చేసే అవకాశముంది. అంతర్గాం గోలివాడ రీచ్ నుంచి మాత్రమే ఇసుకను రవాణా చేయాల్సి ఉంది. మేడిపల్లి నుంచి అక్రమంగా రోజుకు రెండు, మూడు వందల ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నారు.



మేడిపల్లి గోదావరి రీచ్ నుంచి ఇసుక తవ్వకాలు



ఇసుక ట్రిప్పులను నమోదు చేస్తున్న వ్యక్తి

ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు రూ. 100 వసూలు

ఇసుక దందా నడిపిస్తున్న అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒక్క ట్రాక్టర్ ఇసుక ట్రిప్పు రూ.100 వసూలు చేస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కు రూ.2వేల నుంచి రూ.2,300 తీసుకుంటున్నారు. దీని కోసం ఇక్కడ ఒక వ్యక్తిని నియమించి నోట్‌బుక్‌లో ట్రిప్పుల లెక్కలు నమోదు చేస్తున్నారు. రోజుకు 200కుపైగా ట్రిప్పుల ఇసుకను తరలిస్తున్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తున్నది. ఇక్కడ ఎన్టీపీసీకి చెందిన ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మల్యాపూర్ శివారులో మరో రీచ్‌ను అధికార పార్టీకి చెందిన నాయకుడి కనుసన్నల్లో నడుస్తున్నది. అక్కడ గోదావరిఖని ట్రాక్టర్లకు మాత్రమే అనుమతినిచ్చి ట్రిప్పు రూ.100 వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

ఇంటి నిర్మాణాలకు మాత్రమే ఇసుక

కుమారస్వామి, రామగుండం తహసీల్దార్

ఇంటి నిర్మాణాలకు మాత్రమే ఇసుకను అనుమతిచ్చామని రామగుండం తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. జిల్లాలో 6 రీచ్‌లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. మేడిపల్లి శివారులో ఇసుక తరలింపు సమాచారం లేదన్నారు. ఉచిత ఇసుకకు సంబంధించి తహసీల్దార్లకే అధికారం ఇచ్చినట్లు జిల్లా మైనింగ్ అధికారి తెలిపారు.

కాకతీయ కెనాల్‌లో ఒకరి గల్లంతు..

కాపాడబోయిన మరొకరి మృతి



సురేష్(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ సమీపంలో కాకతీయ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. అతడిని కాపాడటానికి ప్రయత్నించిన అతని మిత్రుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన జూపాక శ్రీహరి(48), రేణిగుంట్ల సురేష్(30) అనే ఇద్దరు మంగళవారం గ్రామ శివారులోని కాకతీయ ఉప కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ముందుగా జూపాక శ్రీహరి కాకతీయ కాలువలోకి దిగగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో అందులో కొట్టుకపోయాడు. గమనించిన సురేష్ కాపాడేందుకు కాలువలోకి దిగాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో సురేష్ సైతం కొట్టుకొని పోయాడు. గమనించిన గ్రామస్థులు వెంటనే పోలీసులు సమాచారం అందించారు. కొంతమంది యువకులు సురేష్ మృతదేహాన్ని బయటికి తీశారు. శ్రీహరి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. సంఘటన స్థలానికి హుజూరాబాద్ సీఐ తిరుమల్‌గౌడ్ చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో గల్ఫ్‌లో మృతి

● స్వగ్రామానికి చేరిన మృతదేహం



వెంకటస్వామి(ఫైల్)

రామడుగు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందగా.. మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన నీలం వెంకటస్వామి కొన్ని నెలల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అయితే అక్కడ పనులు చేస్తుండగా ఈ నెల 6న గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమై ఆలయన మృతదేహం కోసం ఎదురు చూశారు. మృతదేహాన్ని ఎయిర్‌పోర్ట్ నుంచి స్వగ్రామానికి తీసుకరావడానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అంబులెన్స్ ఏర్పాటు చేశారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు.

బాలుడిని తప్పించబోయి ఆటో బోల్తా

● ఆరుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై ఎదురుగా వస్తున్న బాలుడిని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తాపడి పలువురికి గాయాలైన సంఘటన వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన 11మంది మహిళా సంఘ సభ్యులు బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలోని బ్యాంకుకు వెళుతున్నారు. సంకెపల్లి గ్రామంలోకి వెళ్లేలోపు ఎదురుగా సైకిల్‌పై వస్తున్న బాలుడిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణించే కట్కూరి కవితకు తీవ్రగాయాలై పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌కు చేయి, మహిళకు చేతివేళ్లు విరగగా, మరో మహిళ శ్వాసతో ఇబ్బంది పడటంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మిగతా వారికి స్వల్ప గాయాలు కాగా వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ పందుగ ప్రదీప్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటనపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సమాచారం అందించడంతో మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా వైద్యాధికారి రజిత, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్యలను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారి రజిత క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

వొకేషనల్ ఉపాధ్యాయుడి హఠాన్మరణం



నవీన్(ఫైల్)

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బందారపు నవీన్(33) మంగళవారం పాఠశాలలో గుండెపోటుకు గురయ్యాడు. తోటి ఉపాధ్యాయులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన నవీన్ రెండు సంవత్సరాల క్రితం ఈ పాఠశాలలో కంప్యూటర్ టీచర్‌గా విధుల్లో చేరాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు జిల్లా ఆసుపత్రికి చేరుకొని నవీన్ మృతదేహాన్ని పరిశీలించారు.

దొంగ బాబాకు దేహశుద్ధి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామస్థులు దొంగ బాబాను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో హన్మాన్ మాలధారణలో ఉన్న ఓవ్యక్తి జ్యోతిష్యం పేరుతో గ్రామంలోని పలువురి డబ్బులు వసూలు చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కొందరు దొంగబాబా పారిపోయినట్టు తెలుసుకుని వెంబడించారు. మల్లాపూర్‌లో దొంగబాబాను పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు దొంగబాబాను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అనుమతి లేని నిర్మాణం కూల్చివేత

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన కోనాయపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మించిన మూడో ఫ్లోర్‌ను మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. గ్రామానికి చెందిన ఓ మహిళ జీ ప్లస్-2 నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు తీసుకుని జీ ప్లస్-3 నిర్మించారు. దీంతో అనమతులకు విరుద్ధంగా నిర్మించిన ఫ్లోర్‌ను తొలగించాలని గ్రామానికి చెందిన ఒకరు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు రెండు రోజుల క్రితం మూడో అంతస్తును తొలగించాలని కోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో కూల్చివేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.



మంథనిలో కూరగాయలు అమ్ముతూనే హఠాన్మరణం చెందిన శంకరమ్మ

వెంటాడిన విధి


పాము కాటుతో గొర్రెల కాపరి మృతి

కూరగాయలు అమ్ముతూ వృద్ధురాలి హఠాన్మరణం

కమాన్‌పూర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వారిద్దరినీ విధి వెంటాడింది. బతుకు పోరులో వారు పని ప్రదేశంలోనే మృత్యువాత పడటం అక్కడ ఉన్న వారిని కలిచి వేసింది. కమాన్‌పూర్ మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన కొయ్యడ రాజయ్య(53) అనే గొర్రెల కాపరి సోమవారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందాడు. రామగుండం మండలం లక్ష్మీపురం శివారులో గొర్లను మేపడానికి మంద ఏర్పాటు చేసుకున్నాడు. మంద ఏర్పాటు చేసుకున్న ప్రదేశం పక్కన నేలపై గొర్లకాపరి నిద్రించగా పాముకాటు వేయడంతో రాజయ్య నిద్రలోనే ప్రాణాలు కోల్పోయాడు. రాజయ్య కుటుంబ సభ్యులు ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మృతదేహానికి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య స్వరూప, కుమారులు రమేష్, సంజీవ్‌లు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎన్‌టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంథనిలో వృద్ధురాలు..

మంథని: స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కూరగాయలు అమ్ముతూ ఓ వృద్ధురాలు ఒక్కసారిగా కుప్పకూలి విగతజీవిగా మారిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం గ్రామానికి చెందిన చీర్ల శంకరమ్మ(60) అనే వృద్ధురాలు మంథనిలో కూరగాయలు అమ్ముతూనే గుండెపోటుకు గురై మృతి చెందింది. నిత్యం బస్సులో సొంత గ్రామం నుంచి కూరగాయలు తీసుకొని వచ్చి మంథనిలో కూరగాయలు అమ్ముకుంటున్న శంకరమ్మ మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. ఆమెతో ఉన్న మహిళ గమనించి పక్కవారి తెలియజేయడంతో వారు 108కు సమాచారం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరితో కలిసిమెలిసి ఉంటూ పనిచేసుకునే శంకరమ్మ హఠాన్మరణం చెందడం కలిచివేసింది.



ఘటన స్థలంలో మృతి చెందిన గొర్రెల కాపరి రాజయ్య

ఫిజికల్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



సాత్విక

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సాత్విక అనే విద్యార్థిని ఫిజికల్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ బహుమతి సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీలకు సాత్విక ఎంపికవడంపై ప్రధానోపాధ్యాయిని కరుణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని మంగ అభినందించారు. పలువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు వారు తెలిపారు.

మూగబోయిన మరమగ్గం



యంత్రంపై దారం చుడుతున్న మహిళ



మగ్గాన్ని శుభ్రం చేస్తున్న కార్మికుడు

- 18 నెలలుగా పనులు లేక పస్తులు
- 'ఇందిర స్వశక్తి' చీరలపై నేతన్న ఆశలు
- ఆపన్న'హస్తం' కోసం కార్మికుల నిరీక్షణ

గంగాధర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాల తయారీలో మరో సిరిసిల్లగా పేరున్న గంగాధర మండలం గర్శకుర్తిలో ఇప్పుడు నైరాశ్యంనెలకొన్నది. ఏ నేతన్నను కదిపినా చేతినిండా పనిలేక.. కడుపునిండా తిండి దొరకక అవస్థలు పడుతన్నారు. ఓవైపు గత బీఆర్‌ఎస్ పాలన నాటి దాదాపు రెండు కోట్ల రూపాయల బకాయిల ఆర్థికభారం... మరోవైపు చేసేందుకు పనిలేక ఇబ్బందిపడుతున్నారు. గడపగడపకు మగ్గాల చప్పుడుతో రంగురంగు ల డిజైన్లతో చీరలకు వన్నె తెచ్చిన పద్మశాలీల మరమగ్గాలు మూగ బోతున్నాయి. తరతరాలుగా వచ్చిన కులవృత్తిని నమ్ముకున్న కుటుంబాలు పనిలేక పూట గడవక కష్టంగా మరింది .కుల వృత్తిలో పనిలేక అప్పుడప్పుడూ ఇతర పనులు చేస్తూ కార్మికులు అష్టకష్టాలు పడు తూ బతుకు బండిని నెట్టుకొస్తున్న మర మగ్గాల కుటుంబాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

అప్పులు చేసి కుటుంబ పోషణ

గంగాధర మండలం గర్షకుర్తి గ్రామంలో 16 వందల మరమగ్గాలతో పాటు చేనేత మగ్గాలు న్నాయి. వీటిపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవించే కుటుంబాలు 800 వందలున్నాయి.

18 నెలలుగా చేసిన మగ్గాలు నిలిచిపోయాయి. దీంతో పనిలేక కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం కార్మికులను గుర్తించి పని కల్పిస్తుందన్న భరోసాతో కాలం వెల్లదీస్తున్నారు. గతంలో ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లను గర్షకుర్తికి ఇవ్వడంతో కార్మికులకు చేతి నిండా పని దొరికింది. గర్షకుర్తితో పాటు గట్టుబూత్కుర్, రంగరావుపల్లి, తాడిజెర్రి, ఉప్పర మల్యాల, గంగాధర గ్రామాల్లో బతుకమ్మ చీరలను తయారు చేసేవారు. ఈ అర్డర్లు నిలిచిపోవడంతో 18 నెలలుగా పనిలేక కార్మికులు చిన్నచితకా పనులు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

స్కూల్ యూనిఫామ్‌ల ఆర్డర్‌తో ఊరట

కొత్త ప్రభుత్వంలో స్కూల్ యూనిఫామ్‌లకు సంబంధించిన ఆర్డర్లు అందించగా కార్మికులకు రెండు నెలల క్రితం కొంత పని దొరికింది. ప్రభుత్వం బతుకమ్మ చీరల తరహాలో ఇందిర మహిళ శక్తి చీరల ఆర్డర్లను అందిస్తామని హామీ ఇవ్వడంతో గర్షకుర్తి నేతన్న కార్మికులు మురిసి పోతున్నారు. చీరల తయారీతో చేతినిండా పని దొరుకుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. మగ్గాల బూజుదులుపుతున్నారు.

పెట్టుబడి లేక ఇబ్బందులు

వేములవాడలో ఏర్పాటు చేసిన నూలు డిపో నుంచి గర్షకుర్తికి ముడిసరుకును అందించాలని, దీనితో ఆర్థిక భారం తగ్గుతొందని కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికే గర్షకుర్తికి జౌళిశాఖ నుంచి మూడు లక్షల మీటర్ల ఆర్వీఎం, పీసీ తయారికి ఉత్తర్వులు వచ్చాయి. పెట్టుబడులు లేక పనులు నిలిచి పోయాయి. వేములవాడ డిపో నుంచి సబ్సీడీపై ఇవ్వక పోవడంతో పని చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడంలేదని కార్మికులు తెలిపారు. నూలుకు సబ్సీడీ ఇచ్చి సంవత్సరం పొడుగునా పనికల్పించాలని మగ్గాల కార్మికులు కోరుతున్నారు.

భారంగా రూ. రెండు కోట్ల బకాయిలు

గత ప్రభుత్వంలో తయారు చేసిన బతుకమ్మ చీరల బిల్లులు గర్షకుర్తికి ఎనిమిది కోట్ల బిల్లులు నిలిచి పోయాయి. బిల్లులు చెల్లించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరగా ఆరు కోట్లు విడుదల చేసింది. మరో రెండు కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నారు. దీంతో కొత్త పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేని పరిస్థితి నెలకొంది.



ఆరబెడుతున్న కార్మికుడు



కండెలు చుడుతున్న మహిళ

స్వశక్తి చీరల ఆర్డర్లతో కార్మికులకు ఉపాధి

యగ్నేష్, కాంగ్రెస్ నాయకుడు



ప్రభుత్వం మరగ్గాల కార్మికులకు చేతినిండా పని కల్పించేందుకు స్వశక్తి మహిళ చీరల ఆర్డర్ల ఆలోచన అభినందనీయం. గర్షకుర్తితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మగ్గాలకు పని కల్పించేందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెల్లి ఉపాధి కల్పించాలని కోరుతా.

కార్మికులకు పని కల్పించాలి

గడ్డం నారాయణ, అధ్యక్షుడు, మరమగ్గాల కార్మికుల సంఘం, గర్శకుర్తి



వృత్తిని నమ్ముకున్న మరమగ్గాల కార్మికులకు ప్రభుత్వం పని కల్పించాలి. గతంలో బతుకమ్మ చీరల తయారీతో ఆరు నెలల పని చేసేవారం. మిగతా సమయంలో పని దొరికేది కాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఇందిర స్వశక్తి చీరల ఆర్డర్లను ఇస్తామని హామీ ఇచ్చింది. దీనితో పాటు ఇతర గుడ్డల తయారీకి ఆర్డర్లు ఇస్తే కార్మికులకు చేతినిండా పని దొరుకు తుంది. ప్రభుత్వం మగ్గాల కార్మికులకు వయస్సుతో నిమిత్తం లేకుండా పింఛన్ అందించాలి.

పశువుల పాకల నిర్మాణానికి రైతుల ఆసక్తి



గుండిలో నిర్మించిన పశువుల పాక



రామడుగు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు చేయూతను అందించేందుకు మహిళ భరోసా పథకం కింద పశువులు, మేకల పాకలు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేస్తోంది. ఈ పథకం ప్రయోజనకరంగా ఉండడంతో మండలంలో 77 మంది పశువుల పాకల నిర్మాణం ప్రారంభించారు. 30 మంది రైతులు నిర్మాణాలు దాదాపు పూర్తి చేశారు. ఇందులో 13 మందికి రైతులకు బిల్లులు చెల్లించారు. మరో 14 మేకల పాకలు మంజూరయ్యాయి. వాటిలో ఏడు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇద్దరికి బిల్లులు చెల్లించినట్లు ఏపీవో రాధా తెలిపారు. నాడెం కంపోస్ట్ షెడ్లు, అజోల్ల గడ్డి పెంపకం షెడ్ల నిర్మాణం కూడా రైతులు చేపడుతుండగా వారికి అదనంగా డబ్బులు చెల్లించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పశువుల పాక నిర్మాణానికి 89 వేలు, మేకల పాకకు 1.19 లక్షల రూపాయలు నిధులను అంద జేస్తున్నారు. వీటిని తిరిగి చెల్లించే అవసరం లేదు. పశువులు, గొర్రెల, మేకల పాకల నిర్మాణంతో ఎండ వాన, చలి వన్య ప్రాణుల నుంచి పశువులను రక్షించుకోవచ్చని రైతులు చెబుతున్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు తహసీల్దార్ నుంచి, పశువులు ఉన్నట్లు పశు వైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. గ్రామ పంచాయతీ తీర్మానం చేస్తే ఈ పథకం కింద నిధులు పొందవచ్చు.

ఉపయోకరంగా ఉంది: మడ్డి ఎల్లయ్య,రైతు, గుండి



పశువుల పాక నిర్మించుకోవడానికి ప్రభుత్వం చేసిన పని చాలా బాగుంది. ఎండ, వాన చలి నుంచి పశువులను కాపాడుకోవడానికి చక్కని మార్గం చూపిస్తుంది. షెడ్డుతో పాటు పెంట కుప్ప, గడ్డి పెంచడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటున్నా..

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన
దేశానికే మార్గదర్శకం

- బీఆర్‌ఎస్, బీజేపీకి కులగణనపై మాట్లాడే అర్హత లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ దేశంలో అన్నివర్గాలవారీగా ఎవరి లెక్క ఎంత అనేది తేలాలని భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ ఎప్పుడో స్పష్టం చేశారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ దొందూ.. దొందేనని, రాంగ్ డైరెక్షన్‌లో పోయేలా ఈ రెండు రాజకీయపార్టీలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో కులగణన చేసినట్లు తెలిపారు.

కులగణన చేయాలనే నిర్ణయం నుంచి నివేదిక వరకు, నివేదిక నుంచి నిధుల వరకు ఎలా అమలు చేయాలనే దానిపై రూట్‌మ్యాప్ తయారు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. మేధావులు, అన్నికులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కులగణనపై అనవసర అనుమానాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడం ఆ రెండు పార్టీలకు ఇష్టంలేదా అని ప్రశ్నించారు. సూచనలు, సలహాలు ఇస్తే తీసుకుంటామన్నారు. బీసీల్లో ముస్లిం మైనార్టీలు ఉండటం అనేది ఇప్పుడు కొత్తది కాదని, గతంలో కూడా ఇదే విధానం ఉండేదన్నారు. అర్బన్ నక్సల్స్ పేరుతో ఒక సెక్షన్‌ను టార్గెట్ చేయవద్దన్నారు. ఎర్రచొక్కా వేసుకున్నవారంతా నక్సల్స్ అనడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రగతిశీల భావాలు కలిగిన తాను ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా ఎర్ర చొక్కా వేసుకున్నా నని, అంతమాత్రాన తాను నక్సలైట్‌ను అవుతానా? అని ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కులగణనలో భాగంగా సర్వేకు వెళ్లిన అధికారులకు ఎలాంటి వివరాలు ఇవ్వని బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ఇప్పుడైనా తమ కుటుంబ, ఆస్తులు, ఇతర వివరాలు అందజేయాలని కోరుతూ సర్వేఫాంలను పోస్ట్ ద్వారా ఆ ముగ్గురు నేతలకు పంపిస్తున్నానని తెలిపారు. బీఆర్ఎస్ ముగ్గురు నేతలు వారి వివరాలు అందజేసిన తరువాతనే కుల గణనపై మాట్లాడేందుకు అర్హులవుతారన్నారు. కులగణనను అడ్డుకుంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్‌ను సమర్పించిన కేంద్రంలోని బీజేపీకి, సర్వేలో పాల్గొనకుండా, వివరాలు అందజేయని బీఆర్‌ఎస్‌లకు కులగణనపై మాట్లాడేందుకు నైతిక అర్హత లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే దేశవ్యాప్తంగా కుల గణన సర్వే చేయించాలని మంత్రి సవాల్ విసిరారు. బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యత నుంచి తొలగిస్తే బీసీ సమాజం బాధపడ్డదని తెలిపారు. ఎమ్మెల్సీ కవితకు లిక్కర్ నినాదం అయిపోవటంతో ఇప్పుడు బీసీ నినాదం ఎత్తుకుందని మంత్రి విమర్శించారు. అప్పుడప్పుడు జాగృతి గుర్తుకు వస్తుందని, ఏమీ లేకపోతే బతుకమ్మ నినాదం ఎత్తుకుంటుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, ఎండీ ఆరిఫ్, నాయకులు మంద నగేష్‌ముదిరాజ్, ఆకుల నర్సయ్య పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ధర్నా

భగత్‌నగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భారతీయ జీవిత బీమా సంస్థలో నియామకాలు, యూనియన్ గుర్తింపు కోసం సంస్థ డివిజనల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. డివిజనల్ మేనేజర్ నారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వామన్‌రావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఎల్ఐసీ వ్యాపారం మూడు రెట్లు పెరిగిందని దీంతో సిబ్బందిపై అద నపు భారం పడుతోందని అన్నారు. పాలసీదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ కేడర్లలో నియామకాలు చేపట్టాలన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో యూనియన్లకు ఎన్నికలు నిర్వహించి గుర్తింపు ఇచ్చారని, ఎమెర్జెన్సీ టైంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా భావ ప్రకటన చేసినందుకు రద్దు చేసిన గుర్తింపును ఇప్పటి వరకు తిరిగి ఇవ్వలేదని అన్నారు. 90 శాతం సభ్యత్వం ఉన్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు వెంటనే గుర్తింపు ఇవ్వాలని, లేని పక్షంలో మరిన్ని పోరాటాలు చేయడానికి సిద్ధమన్నారు. కార్యక్రమంలో డివిజనల్ నాయకులు సూర్యకళ, బసవేశ్వర్, అనుపమ, శ్రీలత, డివో యూనిట్ నాయకులు మహేష్, ప్రభాకరచారి, బ్రాంచ్ వన్ నాయకులు డి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

33 నామినేషన్ల తిరస్కరణ

- పట్టభద్రుల స్థానంలో 32
- ఉపాధ్యాయ స్థానంలో ఒకటి
- 13 వరకు ఉపసంహరణ

కరీంనగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాల నామినేషన్ల పరిశీలన ముగిసింది. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 32 మంది నామినేషన్లను వివిధ కారణాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తిరస్కరించారు. సరైన ఫార్మాట్‌లో ఉన్న 68 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైంది. మిగిలిన 16 మంది నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆమోదించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమే లా సత్పతి మాట్లాడుతూ అభ్యర్థులు నామినేషన్లను సమర్పించిన సందర్భంలో ఏమైనా లోపాలుంటే గుర్తించి అభ్యర్థులకు షాట్ మెమోలు ఇచ్చి సరి చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. కొంత మంది ఈ అవకాశాన్ని వినియోగించుకొని తప్పులను సవరించుకున్నట్లు చెప్పారు. నిబంధనలను అనుసరించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియను చేపట్టామ న్నారు. సరైన ఫార్మాట్‌లో సమర్పించని నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ అనంతరం అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను కోరామని, తిరస్కరణపై అభ్యంతరం వ్యక్తం చేసిన వారి సందేహాలను నివృత్తి చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్‌రామన్, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్, ఏవో నరేందర్, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

చల్లగా చూడమ్మ.. బద్దిపోచమ్మ తల్లీ..

- అమ్మవారికి భక్తుల బోనం మొక్కులు
- నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో బారులు



బద్దిపోచమ్మ దర్శనం కోసం నెత్తిన బోనంతో క్యూలైన్‌లో భక్తులు



వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పిల్లా పాపలను, పాడి పంటలను చల్లగా చూడమ్మా.. బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఇష్టమైన మంగళవారం భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. నెత్తిన బోనాలతో గంటల తరబడి క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి పట్నాలు వేశారు. నైవేద్యాన్ని సమర్పించి నూతన వస్త్రాలను ధరించి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అమ్మవారికి ఇష్టమైన కల్లు సాక పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మున్సిపల్ కమిషనర్ అన్వేష్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో ఈనెల 25 నుంచి 27వ తేది వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు పారిశుధ్యంతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ సిబ్బందికి సూచించారు. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఆలయ ఏఈవో అశోక్, శానిటేషన్ సూపరింటెండెంట్ వరి నర్సయ్యలతో కలిసి ఆలయ పరిసరాల్లోని డ్రైనేజీలను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. మహాశివరాత్రి జాతర సమీపిస్తుండటంతో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచా లని, ఆలయ ఉద్యో గులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఆయన వెంట రాజన్న ఆలయ డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీకాంతచారి తదితరులు ఉన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ


మల్యాల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కొండంతా రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ పర్య వేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి. కాగా ఆలయ పరిసరాలు బురదమయంగా ఉండడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

అంజన్న గర్భాలయానికి వెండి తొడుగులు



వెండి తొడుగుల అనంతరం మెరిసిపోతున్న గర్భాలయం

మల్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి గర్భాలయాలని వెండి తొడుగుల అమర్చారు. రెండేళ్ల క్రితం వెండి తొడుగులతోపాటు మరిన్ని వస్తువులు చోరీకి గురయ్యాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు సోమవారం బంగారు, వెండి ఆభరణాలు, తొడుగులు అందజేశారు. సంప్రోక్షణ పూజల అనంతరం బంగారు పూత గల రామరక్ష, కిరీటం స్వామి వారి మూల విరాట్టుకు అమర్చారు. మంగళవారం గర్భాలయానికి 48.5 కిలోలతో తయారు చేసిన వెండి తొడుగులు అమర్చారు. తొడుగులకు ఉన్న శంఖు చక్రాలు, హనుమాన్ ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.



వెండి తొడుగులు చోరీకి గురికావడంతో బోసి పోతున్న గర్భాలయం (ఫైల్)

గుడుంబా, గంజాయి నిర్మూలనే లక్ష్యం..

- ఎల్లయ్యగౌడ్, వీర్నపల్లి ఎస్సై



ఆంధ్రజ్యోతి : గుడుంబా, గంజాయి నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : మండలంలోని అన్ని గ్రామాల్లో గుడుంబా, గంజాయి నిర్మూలన కోసం ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నాం. గంజాయితో కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నాం. తండాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై : రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాల్లో ప్రతిరోజు అవగాహన కల్పిస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచిస్తున్నాం. ప్రతిరోజు వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధిస్తున్నాం. మైనర్‌లు వాహనాలతో పట్టుబడితే వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : మండలంలో దోపిడీలు, దొంగతనాలు జరగకుండా రాత్రివేళల్లో సిబ్బందితో గస్తీ నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉంటున్నాం. గ్రామాల్లో మీకోసం కార్యక్రమాలను ఏర్పాటుచేస్తూ యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా అవగాహన కల్పిస్తున్నాం. నిరంతరం గ్రామాల్లో పర్యవేక్షణ చేస్తూ నేరస్తులపై పకడ్బందీగా దృష్టి పెడుతున్నాం.

- వీర్నపల్లి (ఆంధ్రజ్యోతి)

'పది'లో మెరుగైన ఫలితాల సాధనకు కార్యాచరణ

- పాఠశాలల్లో పీఎంశ్రీ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



ఉపాధ్యాయులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంగా ప్రతి పాఠశాలలో కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులను ఈనెలా చివరిలోగా పూర్తిచేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం కింద 16 పాఠశాలలను ఎంపికచేయడం జరిగిందని వీటిలో నిర్దేశిత అభివృద్ధి పనులను అవసరమైన మౌళిక వసతులు ఫర్నీచర్, ఇంటర్‌నెట్, టచ్ స్క్రీన్‌లు, శుభ్రమైన తాగునీటి యంత్రాలు, కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్ పరికరాలు, మేజర్, మైనర్ మరమ్మత్తులు, స్మార్ట్ టీవీలు, ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌లు, సోలార్ పవర్ ప్యానెల్‌లు, సీసీ టీవీ కెమెరాలు, పుస్తకాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకరావాలని కోరారు. చేపట్టిన అభివృద్ధి పనులలో అకడమిక్‌పరంగా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లా నుంచి మంచి మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా కార్యచరణను అమలు చేయాలని పాఠశాలలో ఉదయం, సాయంత్రం పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసి పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించే విధంగా కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమైన పాఠ్యాంశాలను ఒకటికి రెండుసార్లు వారితో పునారావృతం చేయించాలని సూచించారు. విద్యార్థుల్లో సందేశాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందే పరిషత్ ఎన్నికలా..?

(5వ పేజీ తరువాయి)



తంగళ్లపల్లిలో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

10, ఇల్లంతకుంటలో 14, గంభీరావుపేటలో 13, కోనరావుపేటలో 12, ముస్తాబాద్‌లో 13, రుద్రంగిలో 5, తంగళ్లపల్లిలో 14, వీర్నపల్లిలో 5, వేములవాడ రూరల్‌లో 7, వేములవాడ అర్బన్‌లో 6, ఎల్లారెడ్డిపేటలో 13 స్థానాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది నియామకాలకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో 709 పోలింగ్ కేంద్రాలు, 3700 మంది పోలింగ్ సిబ్బందిని ఇప్పటికే గుర్తించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈనెల 15లోగా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు పూర్తిచేసే దిశగా ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వడంతో చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

● పరిషత్ ఓటర్లు 3,53,796 మంది..

జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల లెక్క కూడా తేల్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 3,53,796 ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘానికి పంపించారు. ఓటర్లలో 1,71,174 మంది పురుషులు, 1,82,602 మంది మహిళలు ఉన్నారు. 20 మంది జెండర్‌లు ఉన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటర్లలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషుల కంటే 11,428 మంది ఓటర్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి కలెక్టర్ చేయూత..

- ఉపాధి కోసం కుట్టు మిషన్ అందించాలని అధికారులకు ఆదేశం

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయి ఉపాధి లేక ఇబ్బంది పడుతూ కుటుంబ పోషణ కోసం ఉపాధి కల్పించాలంటూ బాధిత మహిళ జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరగా కలెక్టర్ స్పందించి ఉపాధి కోసం జూకీ కుట్టు మిషన్‌ను అందించి చేయూతను ఇచ్చారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన గాజుల శ్రీనివాస్ అనే దివ్యాంగుడు అనారోగ్యంతో మరణించగా, ఆయన భార్య గాజుల అఖిల కుటుంబ పోషణ కోసం చేయూతను అందించాలని కోరింది. దీంతో సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జూకీ కుట్టు మిషన్‌ను అఖిలకు అందించి ప్రభుత్వం తయారు చేయించే యూనిఫాంలతో పాటు ఇతర వాటిల్లో ఉపాధి కల్పించాలని చేనేత జౌళి శాఖ, డీఆర్‌డీవో అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్ పాల్గొన్నారు.

సాగు నీటిని అందించాలని ప్రభుత్వ విప్‌నకు వినతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకెజీ కాల్వ ద్వారా ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు సాగునీటిని అందించేలా కృషి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మండల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వేములవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం నాయకులు కలిశారు. మండలంలోని అక్కపల్లి, రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి, దేవునిగుట్టతండా, అల్మాస్‌పూర్ రాచర్లతిమ్మాపూర్, బాకురుపల్లితండా గ్రామాల్లో సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సాగు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య పేర్కొన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, గంగయ్య, వెంకటేశ్, బాపురెడ్డి, పెంటయ్య, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సాధ్యం కాని హామీలను ఇచ్చి అడ్డదారిలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య విమర్శించారు. సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దాదాపు 50 ఏళ్ల దేశాన్ని పాలించిందని, తెలంగాణ రాష్ట్రం సాధించిన పార్టీగా బీఆర్‌ఎస్ 10ఏళ్ల పాలన అందించిందన్నారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ ఫలాలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరుగ్యారెంటీలు, 420 హామీలను విస్మరించి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను విమర్శిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో తెలంగాణ ప్రజలను మరోసారి కాంగ్రెస్ పార్టీ దగా చేయడం కోసం తెరతీసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనతో బీసీ జనాభను 10శాతం తగ్గించి బీసీల మధ్య అభిప్రాయ బేధాలను తీసుకొచ్చిందని స్థానిక సంస్థల్లో లాభపడాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతంతో పాటు ఎస్సీల రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, నాయకులు గజభీంకార్ రాజన్న, కోడి అంతయ్య, పడిగెల రాజు, బండ నర్సయ్య, చంద్రయ్య, దిడ్డి రాజు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న సిరిసిల్ల పెద్దూరుకు చెందిన భూక్య నర్సింహులు, భూక్య రాజునాయక్‌లను మంగళవారం రాత్రి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. ట్రాక్టర్, కారును సీజ్‌చేశామని ఆయన తెలిపారు.

గంజాయి కేసులో నలుగురు..

సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు మెడికల్ కళాశాల పక్కన రేకులషెడ్డులో ఉంటూ అక్కడే గంజాయిని సాగుచేస్తూ విక్రయిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన దేబ్రట్ ధాలి, మాలే మాలిక్‌లను మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. వీరు మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లో సెంట్రింగ్ పనులుచేస్తూ రేకులషెడ్డు వద్ద గంజాయిని పెంచుతూ తాగడమే కాకుండా ఇతరులకు విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. షెడ్డు వద్ద పెంచుతున్న 40గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని తహసీల్దార్ సమక్షంలో ధ్వంసంచేశామన్నారు. మరో 12మొక్కలను సీజ్‌చేశామన్నారు. వీటి విలువ రూ.5.20లక్షలు ఉంటుందన్నారు. వీరితోపాటు గంజాయి తాగుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రణబ్ సింఘా, సాగర్ సర్కార్, జిబాన్ బిశ్వాస్, రంజీవ్ సంఘాల వద్ద 50గ్రాముల ఎండిన గంజాయి, తాగే పైపులను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశామన్నారు.

ఉన్నత విద్య కాషాయీకరణకు బీజేపీ ప్రభుత్వం కుట్ర..

- ఏఐఎస్ఎఫ్ నాయకుడు మర్రి వెంకటస్వామి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నత విద్యను కాషాయీకరణ చేసే కుట్రలు చేస్తోందని విద్యార్థులు తిప్పికొట్టాలని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి మంద అనిల్, జిల్లా అధ్యక్షుడు రాకేష్‌తోపాటు ఆరు మండలాల నాయకులు పెద్ద సంఖ్యలో ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి మర్రి వెంకటస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర జాతీయ నూతన విద్యావిధానం-2022 పేరుతో మరోవైపు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) 2025 జారీ చేసిన ముసాయిదా డ్రాఫ్ట్ ఇది ఉన్నత విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలను చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం అంటే విద్యారంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎంత ఉందో విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. విద్యార్థులు హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయింపులు చేయకుండా, జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. నూతన విద్యావిధానం, విశ్వవిద్యాలయాల ఫండ్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండడం, యూనివర్సిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడం కోసమే యూజీసీ 2025 సవరించిన నియమాలు వైస్ ఛాన్సలర్ల ఎంపికలో రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాలను ఇస్తున్నాయని ఆరోపించారు. ఇది అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకొని యూజీసీ 2025 ముసాయిదా మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతోందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, నాయకులు కడారి రాములు పంతం రవి, మంద సుదర్శన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మంది అనిల్‌కుమార్, కుర్ర రాకేష్, పెండల ఆదిత్య, వికృతి అరవింద్, పల్లి శ్రీకాంత్, పుట్టి స్వాత్విక్, దొంతి అరుణ్, పవన్, సన్నీ, అభిలాష్, రాహుల్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బాధిత కుటుంబాలను బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి మంగళవారం పరామర్శించారు. వెంకట్రావుపల్లె, ఇల్లంతకుంట గ్రామాల్లో మృతిచెందిన వారి కుటుంబాలను కలిసి సానుభూతిని వ్యక్తం చేశారు. అనగోని యాదగిరి గౌడ్, పర్శరాం, తిప్పారపు వంశీ ఉన్నారు.

ట్రాక్టర్ యూనియన్ కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామ ట్రాక్టర్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సలేంద్రి వేణుగోపాల్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా బడుగు భరత్, ప్రధానకార్యదర్శి సలేంద్రి ప్రశాంత్ యాదవ్, కోశాధికారిగా కొంపెల్లి అనిల్‌కుమార్, సహాయకార్యదర్శిగా శివరాత్రి తిరుపతి, ముఖ్య సలహాదారులుగా ఎరవెల్లి వెంకటరమణారావు, జెట్టి దేవయ్య, మేడుదుల దేవయ్యయాదవ్, ర్యాకం అనిల్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ట్రాక్టర్ యాజమానులు పాల్గొన్నారు.

వానరానికి వైద్య సేవలు..

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని భీమేశ్వరాలయ సమీపంలో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ మీద పడి కరెంట్ షాక్‌కు గురైన వానరం కింద పడిపోయింది. అటుగా వెళ్తున్న ఆలయ ఉద్యోగులు, ప్రజలు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. సెస్ సిబ్బంది వానరాన్ని కాపాడేందుకు ప్రయత్నించారు.ఆలయ గోశాల అసిస్టెంట్ వెటర్నరీ సిబ్బంది తరుణ్, మణిసాయి లకు ఫోన్ చేసి, వానరానికి సత్వర వైద్యం అందించి కాపాడారు.

ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మండలకేంద్రానికి చెందిన ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డిని అక్కపల్లి గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం సన్మానించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్డిల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. ఈకార్యక్రమంలో నారాయణ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గసభ్యులను ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ క్యాలెండర్‌ను జడ్పీమాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు మంగళవారం ఆవిష్కరించారు. పార్టీ ముద్రించిన క్యాలెండర్, డైరీలను పలువురికి అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు కొయ్యడ భాస్కర్, పసుల బాబు, కూనబోయిన రఘు, దమ్మని మధు తదితరులు పాల్గొన్నారు.

ఎడిసన్ జయంతి

చందుర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చీకటిని పారద్రోలిన యోధుడు థామస్ అల్వా ఎడిసన్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముఖేష్, ఉపాధ్యాయులు మేకల పద్మ స్వాతరి నాగమణి చింతల హరిష్మ ఎగోళం మాదవి యాస నవ్యలు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ.. బల్దియా నిర్లక్ష్యం..



సిరిసిల్ల ప్రధాన రహదారిపై మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీ

సిరిసిల్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథ నల్లా నీరు మురికిగా వస్తున్నాయని ప్రజలు మొత్తుకోవడం సర్వసాధారణంగా మారింది. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఎదో ఒక చోట మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో స్వచ్ఛనీళ్లతో పాటు మురికి నీరు ఇంటింటికి చేరుతోంది. సిరిసిల్ల సిద్దిపేట ప్రధాన రహదారి డీఎస్పీ కార్యాలయం సమీపంలో కొద్దిరోజులుగా మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీతో నీళ్ల రోడ్డు పాలవుతున్నాయి. చెత్తచెదారం, మురికినీరు పైపులోకి వెళ్తున్నాయి.నిత్యం ఉన్నతాధికారులు సైతం తిరిగే రహదారిపై భగీరథ నీళ్ల రోడ్డుపై ప్రవహిస్తున్నా పట్టించుకోకపోవడం బల్దియా నిర్లక్ష్యానికి అద్దం పడతోందనే విమర్శలు వస్తున్నాయి.

విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రూ.50 వేల విలువైన షూస్ అందించిన ఉపాధ్యాయులు సింగిరెడ్డి వీరారెడ్డి, సాంబశివుడు, రమణారెడ్డి, అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ కూనబోయిన వినోదలకు అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయిణి ప్రేమలత, ఉపాధ్యాయులు మహేష్‌చంద్ర, మధుసూదన్‌రావు, రమణారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, అనీల్‌కుమార్, మంజుల, సునీత, పుష్పలత, కవిత, సంపత్‌రావు, సత్తయ్య, సుజాతదేవిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గంభీరావుపేట విద్యార్థిని ప్రతిభ



దొంతి స్ఫూర్తి

గంభీరావుపేట ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన దొంతి స్ఫూర్తి అనే విద్యార్థిని జేఈఈ మెయిన్స్ పరీక్షలో ప్రతిభ కనబరిచింది. మంగళవారం సాయంత్రం విడుదలైన ఐఐటి, జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా పరీక్షలో దొంతి స్ఫూర్తి 99.6050116 పర్సెంటైల్ సాధించింది. దీంతో స్ఫూర్తి తల్లిదండ్రులు, అధ్యాపకులు అభినందించారు.

సాగు నీటి సరఫరాకు చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట, తిమ్మాపూర్, గుండారం గ్రామాల శివారులోని తొమ్మిదవ ప్యాకేజీ కాల్వ ద్వారా సాటు నీటి సరఫరాకు నీటి పారుదల శాఖ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. కాల్వలను ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో శుభ్రం చేయించారు. ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బీర్లు మరింత ప్రియం

- పాత స్టాక్ ఖాళీ చేసేందుకు వ్యాపారుల యత్నం
- జిల్లాలో రోజుకు రూ.45లక్షల బీర్ల అమ్మకాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీర్ల ధరల పెంపు అమలుకు ఎక్సైజ్ శాఖ సన్నద్ధమవుతోంది. చల్లని బీర్లు మరింత ప్రియం కానున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు రోజుకు రూ.45లక్షల బీర్ల అమ్మకాలు సాగాయి. రాష్ట్ర ప్రభుత్వం బీర్లపై 15శాతం ధరలు పెంచింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెండు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 48వైన్స్‌లు, 6 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి రోజు రూ. 1.50కోట్ల నుంచి రూ. 2కోట్ల మద్యం క్రయవిక్రయాలు సాగుతాయి. ప్రతి వైన్స్‌లకు రోజుకు 30నుంచి 40బాక్స్‌ల బీర్లు స్టాక్ ఇస్తున్నారు. అయితే పాత స్టాక్‌ను మద్యం వ్యాపారులు ఖాళీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వైన్స్‌లలో బీర్ల నిల్వలను బుధవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేసే అవకాశం ఉంది. తనిఖీల ఆధారంగా వైన్స్‌లలో ఉన్న నిల్వల నివేదిక అందజేసి వాటిపై పెరిగిన ధర లెక్కించి వ్యాపారులు ఎక్సైజ్ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో వైన్స్‌లలో ఉన్న పాత నిల్వలకు పెరిగిన ధరలకే విక్రయించాల్సి ఉంటుంది. పాత స్టాక్ ఖాళీ అయ్యాక కొత్త నిల్వలను సరఫరా చేస్తారు. వేసవిలో బీర్లు ఎక్కువగా అమ్మకాలు జరుగనున్నాయి. జిల్లాలో ప్రతి రోజు 30 వేలకు పైగా బీర్ బాటిళ్లు అమ్ముడుపోయేవి. పెరిగిన బీర్ల ధరల ప్రకారం ఎక్సైజ్ శాఖకు ప్రతి నెల రూ.15కోట్ల ఆదాయం సమకూరనుంది.

ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయిస్తాం..

- డీఎల్‌పీవో నరేష్ - రుద్రంగిలో విచారణ



భూమిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నరేష్

రుద్రంగి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామని డీఎల్‌పీవో నరేష్ తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని గ్రామానికి చెందిన పిట్టల నరేష్ అనే యువకుడు హైకోర్టులో పిల్ దాఖలు చేయగా డీఎల్‌పీవో నరేష్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం డీఎల్‌పీవో నరేష్ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 428/2, 428/3, 428/4 మూడు సర్వే నంబర్లలోని ఎకరం ముప్పయి రెండు గుంటలు గల ప్రభుత్వ భూమిలో కొంత కబ్జాకు గురైందని పిట్టల నరేష్ ఆరోపించడంతో విచారణ జరుపుతున్నామన్నారు. అట్టి భూమిలోని పర్మిషన్ కోసం ఇచ్చిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ సర్వే నంబర్లు వేరుగా ఉన్నాయని, హద్దులు కూడా పక్కాగా లేవన్నారు. రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నిర్వహించి పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుధకార్, కార్యదర్శి రాందాస్, నాయకులు గంగం మహేష్, మంచె రాజేశం, దయ్యాల కమలాకర్, కంటె రెడ్డి, మాడిశెట్టి ఆనందం, చెప్యాల గణేష్, నంద్యాడపు వెంకటేష్, ఉప్పులూటి గణేష్, కొడగంటి శ్యామ్, సాదుల్ల, బోయిని చంద్రయ్య, బోయిని రాజు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

- తంగళ్లపల్లి వైద్యాధికారి డాక్టర్ అఫీజా



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు తదితరులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుష్టు వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని వ్యాధి నివారణ కోసం కృషి చేయాలని తంగళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అఫీజా కోరారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థులకు అవగహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఫీజా మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్సలు అందిస్తే పూర్తిగా నయం అవుతుందన్నారు. అశ్రద్ధ చేస్తే అంగవైక్యం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. చర్మంపై రాగి రంగు మచ్చలు ఉండి స్పర్శ జ్ఞానం లేని ఎరుపు మచ్చలు ఉంటే ప్రారంభ దశలోనే ఆసుపత్రుల్లో చూపించుకోవాలని కోరారు. ఈ వ్యాధికి ప్రభుత్వ అసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అయుష్ వైద్యాధికారి డాక్టర్ దీప్తి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రహనా ఇఫత్, డీపీఎమ్‌వో దేవుసింగ్, హెల్త్ అసిస్టెంట్ సతీషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణపై అవగాహన కల్పించాలి



రికార్డులను పరిశీలిస్తున్న రవీందర్‌రెడ్డి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణపై రైతులకు అవగాహన పెంచాలని జిల్లా పశువర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని పశువైద్యశాలను ఆయన మంగళవారం పరిశీలించారు. మండలంలో ఎస్‌ఎల్‌ఎమ్ స్కీం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. పౌల్ట్రీఫామ్స్‌ను పరిశీలించి తగిన సూచనలు చేయాలన్నారు. గొర్ల షెడ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. పాడిపరిశ్రమ ద్వారా ఆర్థికాభివృద్ధి ఎలా సాధించవచ్చో రైతులకు తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి ఇందిర పాల్గొన్నారు.